

మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న ఎంపీ డా. లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ఎంపీ డా. కె. లక్ష్మణ్ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ప్యారడైజ్ ఆధ్వర్యంలో గురువారం త్యాగరాయగానసభలో 100 మంది పేద మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, లయన్స్‌క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ అధ్యక్షుడు సెరిపల్లి గణేష్, కార్పొరేటర్లు పావని వినయ్‌కుమార్, రచనశ్రీ, రవిచారి, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్. మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ట్రై సైకిళ్ల పంపిణీ

చిక్కడపల్లి, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి తిరిగి చెత్త సేకరించే పారిశుధ్య కార్మికులకు మునిసిపల్ శాఖ మంజూరు చేసిన ట్రై సైకిళ్లను ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ, పావని జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్ ఆవరణలో గురువారం పంపిణీ చేశారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ 15 డీఎంసీ ఖాదర్ మొయినొద్దీన్, ఏఎంహెచ్‌వో ప్రవీణ, బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో అభివృద్ధి పనులను ప్రారంభించాలి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో గతంలో మంజూరైన అభివృద్ధి పనులను ప్రారంభించి వేగవంతంగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ కోరారు. గురువారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరానని తెలిపారు.



బాలికల వసతిగృహంలో పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంసీ ఖాదర్ మొయినొద్దీన్, ఏఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ

బాలికల వసతిగృహంలో

ప్రతిరోజూ పారిశుధ్య పనులు నిర్వహిస్తాం

ముషీరాబాద్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ప్రతిరోజూ పారిశుధ్య పనులు నిర్వహిస్తామని జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 డీఎంసీ ఖాదర్ మొయినొద్దీన్ అన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి భోలక్‌పూర్ బాలికల వసతి గృహాన్ని బుధవారం సందర్శించి హాస్టల్‌లో అపరిశుభ్రంగా ఉండటాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు గురువారం బాలికల వసతి గృహాన్ని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. హాస్టల్ పరిసరాల్లో దోమలనివారణ మందు చల్లించారు.

సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో రూ. 6 లక్షలతో డ్రైనేజీ పైపులైన్

నల్లకుంట, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్ సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో రూ. 6 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ పైపులైన్ పనులకు కార్పొరేటర్ బి. పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీలో పర్యటించి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఎంవోహెచ్ డాక్టర్ హేమలత, ఏఈ మాజీద్, హార్టికల్చర్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక రచనలు మరిన్ని రావాలి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక రచనలు మరిన్ని వస్తేనే సనాతనధర్మం, పండగలు పరిఢవిల్లుతాయని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. గురువారం రాత్రి త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పురాణపండ శ్రీనివాస్ సహకారంతో రూపొందించిన గణానాం త్వా ఆధ్యాత్మిక గ్రంథావిష్కరణ జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ.. వినాయకచవితిని పురస్కరించుకొని పుస్తకాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త అనంతలక్ష్మి మాట్లాడుతూ.. ముందు తరాలకు సనాతనధర్మం అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, పాలకమండలి సభ్యురాలు గుండవరపు గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తయారీకి ఇంటింటి కార్యక్రమం

రాంనగర్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో ఓటర్ల నమోదు, డబుల్ ఓట్లు, బదిలీ అయిన ఓటర్ల వివరాలపై సర్కిల్ డీఎంసీ మారుతీదివాకర్ గురువారం రాజకీయ పార్టీల నేతలు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అంబర్‌పేటలో ఓటర్ల జాబితా తయారు చేసేందుకు ఇంటింటి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వరద బాధితులను ఆదుకోవాలి

రాంనగర్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని పారిశ్రామికవేత్త వీబూర్ అగర్వాల్ కోరారు. గురువారం కందూరి కృష్ణ, సేథ్ మాణిక్‌లాల్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లిలోని లోతట్టు ప్రాంతాల బాధితులకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు.

చండీగఢ్ నుంచి హైదరాబాద్‌కు మద్యం అక్రమ రవాణా

- రూ. 3.85 లక్షల విలువైన మద్యాన్ని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్‌తో పాటు.. ఇతర ప్రాంతాల నుంచి నగరానికి అక్రమంగా రవాణా అవుతున్న నాన్‌పెయిడ్ లిక్కర్‌పై ఎక్సైజ్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గురువారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో గోవా నుంచి నగరానికి రవాణా అవుతున్న రూ. 12 లక్షల విలువైన 415 మద్యం బాటిళ్లను, సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో మరో 3.85 లక్షల విలువైన అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు. ఈ మద్యం చండీగఢ్ నుంచి నగరానికి దిగుమతి అయినట్లు గుర్తించారు. అత్తాపూర్‌కు చెందిన గోపాల్ అగర్వాల్ చండీగఢ్ నుంచి హైదారాబాద్‌కు వాహనంలో మద్యం తీసుకొచ్చాడు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో మెట్రో స్టేషన్ సమీపంలో మరో వాహనంలో తరలించడానికి ప్రయత్నిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. 72 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ. 3.85 లక్షలు ఉంటుందన్నారు.

కుటుంబ కలహాలకు తల్లీపిల్లలు బలి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల కలహాలు ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేశాయి. తల్లి, కుమారుడు మృతి చెందగా, కుమార్తె జాడ దొరకలేదు. భర్తతో కలహాలతో ఓ తల్లి తన ఇద్దరు కుమారులు, కుమార్తెతో గురువారం రాత్రి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్దకు వెళ్లింది. ఓ కుమారుడు, కుమార్తెను చెరువులోకి తోసి తానూ దూకింది. తల్లి, కుమారుడు మృతి చెందారు. కుమార్తె జాడ తెలియలేదు. ఆమె కోసం పోలీసులు చెరువులో ముమ్మరంగా గాలిస్తున్నారు. వనస్థలిపురం సంపూర్ణ థియేటర్ కూరగాయల మార్కెట్ వద్ద నివసిస్తున్న ఒరుసు కుమార్‌కు భార్య మంగ(35), కుమార్తె లావణ్య (15), కుమారులు విఘ్నేష్(5), శరత్(7) ఉన్నారు. గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో మంగ పిల్లలను తీసుకొని బస్సులో ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్దకు చేరుకుంది. పెద్దతూము కింద మెట్ల వెంట కిందికి దిగిన మంగ.. కుమార్తె లావణ్య, కుమారుడు శరత్‌ను నీళ్లలో తోసి తాను దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మరో కుమారుడు విఘ్నేష్ తప్పించుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసులు, మున్సిపల్ సిబ్బంది మంగ, శరత్ మృతదేహాలను బయటకు తీశారు. లావణ్య ఆచూకీ లభ్యం కాలేదు. మూడు, నాలుగు రోజుల నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని సమాచారం. దాంతో పిల్లలను స్కూల్ నుంచి తీసుకువస్తానని చెప్పి మంగ.. వారిని తీసుకొని నేరుగా ఇబ్రహీంపట్నం వెళ్లినట్లు బంధువులు తెలిపారు. కుమార్, మంగలది రెండో వివాహమని, లావణ్య మంగ మొదటి భర్త సంతానమని సమాచారం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ముషీరాబాద్ డిప్యూటీ ఐఓఎస్ స్వరూపరాణిని సన్మానించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు



కవాడిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కార్పొరేటర్ జి. రచనశ్రీ



భోలక్‌పూర్ ఇందిరానగర్‌లోని మార్టినెట్ స్కూల్ ఉపాధ్యాయులను సన్మానించిన గుల్షన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చాంద్‌పాషా, హాజీ తదితరులు

ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్

- ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ అని కొనియాడారు. కార్యక్రమంలో ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐఓఎస్ స్వరూపరాణి, ఉపాధ్యాయులు నరేందర్ యాదవ్, శ్రీనివాస్, రతన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్‌లోని మార్టినెట్ హైస్కూల్‌లో గుల్షన్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు.



ట్యాంక్‌బండ్‌పై సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పులిగారి గోవర్ధన్‌రెడ్డి, విద్యార్థులు

ముషీరాబాద్‌లో..

ముషీరాబాద్‌లోని రేడియెంట్ హైస్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అహ్మద్ భక్తియార్‌తోపాటు టీచర్లను బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు.

కవాడిగూడలో..

కవాడిగూడ: ట్యాంక్‌బండ్‌పై ఉన్న మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కవాడిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ జి. రచనశ్రీ పాల్గొని 21 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఇందిరాపార్కులో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ పాల్గొని ఉపాధ్యాయులను సన్మానించారు.



బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో రాధాకృష్ణన్‌కు నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సభ్యులు

శాంతినికేతన్ హైస్కూల్‌లో..

బర్కత్‌పుర: శాంతినికేతన్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ మారెడ్డి ఉపాధ్యాయులను సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి మన్నె మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. చిరంజీవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు గీతాబాయి, మేఘమాల, రజని, బాలమణి, శ్రీనివాస్‌రావు, రామ్మోహన్, అనీల్ రెడ్డి, పరమేశ్వర్, ఫిజికల్ డైరెక్టర్ బి. లక్ష్మయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో..

రాంనగర్: బాగ్‌లింగంపల్లి సుందరయ్యపార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్. వివేక్ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి రమేష్, మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ ఆశయాల అమలుకు గౌడ కులస్థులు కృషిచేయాలి

రాంనగర్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలో గౌడ కులస్థులకు ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ ఆశయాల అమలుకు గౌడ కులస్థులు పాటుపడాలని సూచించారు. గురువారం అంబర్‌పేట గౌడ సంఘం భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన పాపన్నగౌడ్ విగ్రహాన్ని మాజీమంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో కలిసి మంత్రి ఆవిష్కరించారు.



పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాపన్నగౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకొని బలహీన వర్గాలు ముందుకు సాగాలన్నారు. మాజీమంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. గౌడ కులస్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ.. అంబర్‌పేటలోని గౌడ కులస్థుల అభివృద్ధి, సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తామన్నారు. కాంగ్రెస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి, ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి మాట్లాడుతూ.. అంబర్‌పేట గౌడ సంఘం భవనానికి ఏసీ కోసం రూ. 5 లక్షల ఆర్థిక సహకారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బి. పద్మావెంకటరెడ్డి, దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, విజయ్ కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్, అంబర్‌పేట గౌడ సంఘం చైర్మన్ జ్ఞానేశ్వర్‌గౌడ్, అధ్యక్షుడు బింది రాజుగౌడ్, ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

నల్లకుంట/బర్కత్‌పుర/రాంనగర్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. గురువారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డి ప్రజలకు ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ బి. వెంకటరెడ్డి, జీహెచ్‌ఎంసీ ఏఎంవోహెచ్ డాక్టర్ హేమలత, చంద్రమోహన్, మోర శ్రీరాములు ముదిరాజ్ పాల్గొన్నారు. బర్కత్‌పుర హౌసింగ్ బోర్డు కాలనీ పార్కులో మట్టి వినాయక విగ్రహాలను జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, కాచిగూడ డివిజన్‌లో విగ్రహాలను కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్. వివేక్, సభ్యులు గురువారం పంపిణీ చేశారు.



కాచిగూడలో విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరి అరెస్ట్

- విడిభాగాలను కొనుగోలు చేస్తున్న ముగ్గురు వ్యాపారులను కూడా..
- మూడు వాహనాలు, రూ. 85 వేలు స్వాధీనం

రాంనగర్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): రద్దీ ప్రాంతాల్లో పార్క్ చేసిన ద్విచక్రవాహనాలను దొంగిలిస్తున్న ఇద్దరు నిందితులతోపాటు వాటిని కొనుగోలు చేస్తున్న ముగ్గురు వ్యాపారులను ముషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు వాహనాలు, నగదు, వాహనాల కీచైన్‌లు, చోరీకి ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిక్కడపల్లి సబ్ డివిజన్ ఏసీపీ ఎల్. రమేష్‌కుమార్, ముషీరాబాద్ సీఐ రాంబాబు వివరాలు వెల్లడించారు. భోలక్‌పూర్‌లో నివసిస్తున్న ఎండీ ఖాజాహుస్సేన్ అలియాస్ ఖాజా(31) పాత నేరస్థుడు. స్క్రాప్ వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారం లాభసాటిగా లేకపోవడంతో ద్విచక్రవాహనాలు దొంగిలించి విడి భాగాలు అమ్మి సొమ్ము చేసుకుంటున్నాడు. తనకు సహాయకుడిగా భోలక్‌పూర్‌కు చెందిన మహ్మద్ యూసఫ్ పాషా(42)ను పెట్టుకున్నాడు. కొంతకాలంగా డూప్లికేట్ తాళాలతో బార్ల ఎదుట, రద్దీ ప్రాంతాల్లో పార్క్ చేసిన వాహనాలను దొంగిలించి విడిభాగాలను భోలక్‌పూర్‌లో స్క్రాప్ వ్యాపారులు మహ్మద్ సద్దామ్ హుస్సేన్, మహ్మద్ రెహ్మాన్ హుస్సేన్, మహ్మద్ దస్తగిరికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గురువారం ఖాజా హుస్సేన్, మహ్మద్ యూసఫ్ పాషా ద్విచక్రవాహనంపై దొంగతనానికి బయలుదేరారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమేష్‌కుమార్

ముషీరాబాద్ పోలీసులు భోలక్‌పూర్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారి నుంచి మూడు ద్విచక్రవాహనాలు, రూ. 85 వేలు, వాహనాల కీచైన్‌లు, చోరీకి ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరితోపాటు విడిభాగాలు కొనుగోలు చేస్తున్న ముగ్గురు వ్యాపారులను రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంక్ష యాదవ్ అభినందించారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐలు చలపతిరెడ్డి, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అవినీతి, నిర్లక్ష్యం'పై డిస్కం వేటు

- ఆరుగురి సస్పెన్షన్, నలుగురు కార్పొరేట్ ఆఫీస్‌కు బదిలీ
- 9 మందికి షోకాజ్ నోటీసులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో అవినీతికి పాల్పడుతూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక దృష్టిసారించింది. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశాలతో 7 నెలల్లో 19 మంది ఇంజనీర్లు, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఆరుగురు ఇంజనీర్లను సస్పెండ్ చేయగా, నలుగురిని కార్పొరేట్ ఆఫీస్‌కు బదిలీ చేశారు. 9 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. అవినీతి ఆరోపణల జాబితాలో మరికొంత మంది అధికారుల పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

అవినీతి ఆరోపణలపై ప్రత్యేక దృష్టి

గ్రేటర్‌జోన్ శివారు సర్కిళ్లలో పనిచేస్తున్న అధికారులపై ఎక్కువ అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. కొండాపూర్ డివిజన్‌లోని అల్లాపూర్ సెక్షన్‌లో ఓ లైన్‌మన్‌తో పాటు ఇద్దరు ఆర్టిజన్లను సస్పెండ్ చేశారు. మంగళవారం ఇబ్రహీంబాగ్ ఏడీఈ అంబేద్కర్‌ను కార్పొరేట్ ఆఫీస్‌కు అటాచ్‌చేయగా, నార్సింగ్ ఏఈ సందీప్ రెడ్డిని సస్పెండ్ చేశారు. మేడ్చల్, హబ్సిగూడ, రాజేంద్రనగర్, సైబర్‌సిటీ, సికింద్రాబాద్ సర్కిళ్ల పరిధిలోని పలు సబ్‌డివిజన్లలో కొంతమంది ఏడీఈలతోపాటు ఏఈలపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. వీరిని త్వరలో జరిగే బదిలీల్లో కార్పొరేట్ ఆఫీస్‌తో పాటు ఆఫీస్ పోస్టులకే పరిమితం చేయనున్నారు.

కీలకమైన మెట్రోజోన్ సీఈ పోస్టు ఖాళీ

గ్రేటర్ విద్యుత్ సరఫరాలో కీలకమైన మెట్రోజోన్ సీఈగా బాధ్యతలు నిర్వహించిన మోహన్‌రెడ్డి ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేశారు. ఆపరేషన్ విభాగంలో కీలకమైన మెట్రోజోన్ సీఈగా ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు. సీనియర్ స్థాయి ఎస్ఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ఆన్‌లైన్ షాపింగ్‌తో పైలం

- నకిలీ వెబ్‌సైట్లను సృష్టిస్తున్న సైబర్ కేటుగాళ్లు
- భారీ డిస్కౌంట్ల పేరుతో ఆకర్షిస్తున్న వైనం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): ఈ కామర్స్ సైట్లలో భారీ డిస్కౌంట్‌ల పేరుతో సైబర్ కేటుగాళ్లు కొత్తరకం మోసాలకు తెరతీస్తున్నారు. వినాయక చవితి, దసరా, దీపావళి.. వరుస పండుగల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఆన్‌లైన్ షాపింగ్‌ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఆన్‌లైన్ షాపింగ్‌లకు పెరిగిన అధిక గిరాకీని అవకాశంగా తీసుకుంటున్న కేటుగాళ్లు ఆన్‌లైన్ షాపింగ్ చేసేవారిని టార్గెట్ చేస్తూ నకిలీ వెబ్‌సైట్లను సృష్టిస్తున్నారు. ఖరీదైన బ్రాండెడ్ దుస్తులు, శారీస్ తక్కువ ధరకే ఇస్తున్నట్లు ప్రకటనలు గుప్పించి.. పండగ పేరుతో ప్రత్యేక ఆఫర్‌ల పేరిట సోషల్‌మీడియా, ఆన్‌లైన్‌లో పోస్టులు పెడుతున్నారు. వెనుకా ముందు చూడకుండా ఆ నకిలీ వెబ్‌సైట్ల లింక్‌లను క్లిక్ చేస్తున్నారు. ఆర్డర్ బుక్‌చేసి, డబ్బులు చెల్లించిన తర్వాత పార్శిల్ రాక మోసపోతున్నారు. అనుమానం వచ్చిన కస్టమర్లు అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేస్తే స్విచాఫ్ వస్తోంది. ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న సైబర్ ముఠాలు కొన్ని అయితే.. మరికొన్ని ముఠాలు తిరిగి డబ్బులు చెల్లిస్తామంటూ క్యూఆర్ కోడ్‌లు పంపించి కస్టమర్ల ఖాతాలను ఖాళీ చేస్తున్నారు.

ప్రతీ సైట్‌నూ క్లిక్ చేయొద్దు

ఆన్‌లైన్‌లో కనిపించే ప్రతీ ఈ కామర్స్ సైట్‌ను ఓపెన్ చేయొద్దు. నమ్మకమైన ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్లనే ఎంచుకోవాలి. సాధ్యమైనంత వరకు క్యాష్ ఆన్ డెలివరీకి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆన్‌లైన్ షాపింగ్ సమయంలో అడగగానే బ్యాంకు ఖాతాలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ వ్యాలెట్స్ వివరాలు నమోదు చేయొద్దు.

\- సైబర్ క్రైమ్ పోలీసులు

జాతకాల పేరుతో మోసం

- నలుగురి అరెస్ట్.. రూ. 20 లక్షలు స్వాధీనం

కవాడిగూడ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): జాతకాల పేరుతో మహిళను మోసం చేసిన నలుగురు వ్యక్తులను గాంధీనగర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 20 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కుమారి ఎం. జయనందిని(45) ఆమె తల్లితో కలిసి భోలక్‌పూర్‌లో నివసిస్తోంది. జయనందిని తల్లి కొంతకాలంగా అనారోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత లేక ఇబ్బంది పడుతోంది. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పురాణం నివాస్(19) ఇన్‌స్టాగ్రామ్‌లో జయనందినికి పరిచయమయ్యాడు. మీ ఇంట్లో పూజలు చేయాలంటూ ఆమెను నమ్మించి రూ. 5 వేలు తీసుకున్నాడు. తల్లి ఆరోగ్యం కుదుటపడకపోవడంతో ఆమె మరోసారి అతడిని సంప్రదించింది. మీ ఇంట్లో ఆత్మలు తిరుగుతున్నాయి.. పెద్ద పూజలు చేయాలంటూ నివాస్ మళ్లీ ఆమెను నమ్మించాడు. ఈ నేపథ్యంలో నివాస్ తన స్నేహితులు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కిన్నెర సాయి(30), ఈర్నాల వాసు(40), పురాణం నాగరాజు (33)ను ఆశ్రయించాడు. నాగరాజు ముషీరాబాద్‌లోని బాపూజీనగర్‌లో ఉంటున్నాడు. నలుగురూ కలిసి జయనందిని నుంచి దశలవారీగా రూ. 28.32 లక్షలు కాజేశారు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు ఈనెల 1వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు ప్రారంభించి నిందితులు పురాణం నివాస్, కిన్నెరసాయి, ఈర్నాల వాసు, పురాణం నాగరాజును అదుపులోకి తీసుకొని రూ. 20 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

పాన్‌షాప్, టీకొట్టు నిర్వాహకుడిపై దాడిచేసిన

అన్నదమ్ములకు రిమాండ్

చిక్కడపల్లి, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): పాన్‌షాప్, కేఫ్ నిర్వాహకుడు, టీకొట్టు నిర్వాహకుడిపై దాడి చేసిన ఇద్దరు సోదరులను చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌లింగంపల్లి మూన్‌కేఫ్ వద్ద ఈషు పాన్‌షాప్, కేఫ్‌ను అభిలాష్ నిర్వహిస్తున్నాడు. పక్కనే మహ్మద్ రఫిక్(33) టీ కొట్టు నడుపుతున్నాడు. ఈనెల 1న రాత్రి 7 గంటల సమయంలో జి. నరేష్(33) డబ్బులు ఇవ్వకుండా సిగరెట్ ప్యాకెట్ ఇవ్వమని అభిలాషను అడిగాడు. తనకు ఇవ్వాల్సిన రూ. 8 వేలు ఇవ్వమని అభిలాష్ కోరాడు. ఇంకోసారి డబ్బులు అడిగితే చంపేస్తానని బెదిరించి సిగరెట్ ప్యాకెట్ తీసుకొని వెళ్లిపోయాడు. అదేరోజు రాత్రి 11.30 గంటలకు నరేష్‌న తన తమ్ముడు జి. నవీన్‌నాయుడు అలియాస్ చోటు(29)తోపాటు మరికొంతమంది స్నేహితులు మద్యం తాగి పాన్‌షాప్ వద్దకు వెళ్లి దుర్భాషలాడారు. మహ్మద్ రఫిక్ తనవద్ద నెల కిందట రూ. 2 వేలు తీసుకుని ఇవ్వలేదని నరేష్ ఆరోపిస్తూ బండరాయితో అతడి తలపై కొట్టాడు. పాన్‌షాప్‌లోకి ఈడ్చుకెళ్లి దుర్భాషలాడుతూ కొట్టాడు. అడ్డుకోబోయిన అభిలాష్‌ను కూడా కొట్టారు. షాప్‌లో ఉన్న కస్టమర్స్‌ను బెదిరించి కొట్టి పంపించేశారు. బాధితులు అభిలాష్, రఫిక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులు నరేష్, చోటును గురువారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

పోచారం మున్సిపల్ చైర్మన్‌ను అరెస్ట్ చేయాలి

రాంనగర్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజీగూడ గాయత్రి ఆలయం పక్కన ఎఫ్‌టీఎల్‌లో ఉన్న మీరాలకుంట చెరువును కబ్జా చేసిన మున్సిపల్ చైర్మన్ వి. కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు ఎన్. శేఖర్‌ను అరెస్ట్ చేయాలని 10వ వార్డు కౌన్సిలర్ బాలగౌని వెంకటేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బతుకమ్మ ఘాట్ పేరుతో సుమారు వెయ్యి నుంచి రెండు వేల గజాల వరకు చెరువులో మట్టి నింపారని ఆరోపించారు. చెరువు కింద ఆ గ్రామ ప్రజల పంట పొలం మూడు ఎకరాల 30 గుంటలు ఉండగా.. అందులో 30 గుంటలను మట్టితో పూడ్చివేశారన్నారు. ఈ విషయమై గతంలో జిల్లా కలెక్టర్‌కు, రెండు రోజుల క్రితం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు కూడా ఫిర్యాదు చేశానన్నారు. ఇరిగేషన్ ఏఈ పరమేష్ కబ్జాపై పోచారం పీఎస్‌లో ఫిర్యాదు చేశారన్నారు.

హెబ్రోన్ చర్చిలో సంఘటనలపై

సీబీఐతో విచారణ జరిపించాలి : జెరూసలేం మత్తయ్య

బర్కత్‌పుర, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ క్రాస్‌రోడ్‌లోని హెబ్రోన్ చర్చిలో జరిగిన సంఘటనలపై సీబీఐతో విచారణ జరిపించాలని ఆలిండియా దళిత క్రైస్తవ సంఘాల సమాఖ్య కార్యదర్శి జెరూసలేం మత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిషప్ భాస్కర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. చర్చిలో జరిగిన సంఘటన కుట్రకు ప్రధాన కారకుడైన మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావుపై చర్యలు తీసుకోవాలని, ఆయనను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

పదేళ్లుగా హెబ్రోన్ చర్చి సొసైటీ-ట్రస్ట్‌ల మధ్య జరుగుతున్న వివాదంలో భాగంగా సొసైటీకి మద్దతుగా ఉన్న రాజేశ్వర్‌రావు సొసైటీ, ట్రస్టుల మధ్య వివాదం సృష్టించారని ఆరోపించారు. సొసైటీకి అనుకూలంగా కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రభుత్వం జోక్యం చేసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

'ట్రస్టు సమావేశాలకు హాజరు కావద్దు'

చిక్కడపల్లి, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): గోల్కొండచౌరస్తాలోని హెబ్రోన్ చర్చి కేంద్ర కార్యాలయంలోకి దౌర్జన్యంగా ప్రవేశించిన ట్రస్టు వారు ఈనెల 6, 7 తేదీల్లో నిర్వహిస్తున్న సమావేశాలకు దైవసేవకులు హాజరు కావొద్దని హెబ్రోన్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ, జనరల్‌బాడీ సభ్యులు బ్రదర్ జేమ్స్, జోసెఫ్, థామస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం రాత్రి జేమ్స్, జోసెఫ్, థామస్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. 20 సంవత్సరాలుగా ఒక్క కోర్టు కేసులో కూడా గెలవలేని ట్రస్టువారు సక్రమమార్గంలో సొసైటీపై నెగ్గలేమని భావించి దౌర్జన్యంగా హెబ్రోన్ చర్చిని ఆక్రమించుకుని ఏదో సాధించామని మురిసిపోతున్నారని ఎద్దేవా చేశారు.